## భారత్ ఓటమి

**ఏషియా టీమ్ చాంపియన్‌షిప్**

షా ఆలమ్(మలేషియా): బ్యాడ్మింటన్ ఏషియా టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత్ 2–3 తేడాతో చైనా చేతిలో ఓటమిపాలైంది. గురువారం జరిగిన గ్రూపు పోరులో భారత్ ఓటమి వైపు నిలిచింది. సింగిల్స్ తొలి పోరులో ప్రణయ్ 6–21, 21–18, 21–19తో వెంగ్‌హాంగ్‌పై గెలువడంతో భారత్ 1–0 ఆధిక్యంలోకి వెళ్లింది. మరో సింగిల్స్‌లో లక్ష్యసేన్ 21–11, 21–16తో లీ లాన్‌జీపై గెలిచిచాడు. అయితే డబుల్స్‌లో అర్జున్, ధృవ్ జోడీతో పాటు సూరజ్, పృథ్వీ ద్వయం వేర్వేరు గేముల్లో ఓడిపోవడం భారత్ గెలుపు అవకాశాలను దెబ్బతీసింది.

## టీమ్ఇండియా ర్యాంక్ 117

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య(ఫిఫా) ర్యాంకింగ్స్‌లో భారత్ ర్యాంక్ మరింత దిగజారింది. గురువారం ఫిఫా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు 15 ర్యాంక్‌లు చేజార్చుకుని 117వ స్థానం లో నిలిచింది. గత ఏడేండ్లలో టీమ్ఇండియాకు ఇది పేలవ ర్యాంక్. ఇటీవల జరిగిన ఏఎఫ్‌సీ ఏషియన్ కప్‌లో ఆడిన మూడు గ్రూపు మ్యాచ్‌ల్లో భారత్ ఓడిపోవడం ర్యాంకింగ్స్‌పై తీవ్ర ప్రభావం చూపింది. ఆస్ట్రేలియా, ఉజ్బెకిస్థాన్, సిరియాతో ఆడిన మ్యాచ్‌ల్లో భారత్ కనీసం ఒక్క గోల్ చేయలేకపోయింది. ఆసియా ర్యాంకింగ్స్ పరంగా చూస్తే టీమ్ఇండియా ప్రస్తుతం 22వ ర్యాంక్‌లో ఉంది.

## కివీస్ లక్ష్యం 267

హామిల్టన్(న్యూజిలాండ్): దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య రెండో టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 267 పరుగుల లక్ష్యఛేదనలో కివీస్ వికెట్ కోల్పోయి 40 పరుగులు చేసింది. లాథమ్ (21) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు రెండో ఇన్నింగ్స్‌కు దిగిన సఫారీలు 235 పరుగులకు ఆలౌటయ్యారు. బెడింగ్‌హామ్ (110) సెంచరీతో కదంతొక్కగా, సహచర బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. పీటర్సన్ (43),నీల్ బ్రాండ్ (34) మినహా అందరూ సింగిల్ డిజిట్ స్కోర్లకు పరిమితమయ్యారు. విలియమ్ రూర్కీ (5/34) ఐదు వికెట్లతో సఫారీల పతనాన్ని శాసించాడు.

## భావోద్వేగ భరితమై..

**టెస్టుల్లో సర్ఫరాజ్, జురెల్ అరంగేట్రం**



రాజ్‌కోట్: ఎన్నో భావోద్వేగాల కలయికకు భారత్, ఇంగ్లండ్ మూడో టెస్టు మ్యాచ్ వేదికైంది. ఎన్నాళ్లో వేచిన హృదయం అన్న రీతిలో ఏండ్లుగా ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. దేశవాళీ టోర్నీల్లో దుమ్మురేపుతూ జాతీయ జట్టు పిలుపు కోసం ఇన్నాళ్లు వేచిచూసిన యువ క్రికెటర్లు సర్ఫరాజ్ ఖాన్, ధృవ్ జురెల్ ఎట్టకేలకు భారత టెస్టు జట్టులో అరంగేట్రం చేశారు. విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్ లాంటి స్టార్ క్రికెటర్ల గైర్హాజరీలో సర్ఫరాజ్, జురెల్‌కు చాన్స్ లభించింది. సర్ఫరాజ్‌కు క్రికెట్ దిగ్గజం అనిల్ కుంబ్లే క్యాప్‌ను అందించగా, జురెల్‌ను వెటరన్ వికెట్‌కీపర్ దినేశ్ కార్తీక్ జట్టులోకి ఆహ్వానించాడు. ఈ సందర్భంగా భావోద్వేగ సన్నివేశాలు చోటు చేసుకున్నాయి. తన కొడుకు సర్ఫరాజ్ అరంగేట్రం కోసం ఎదురుచూసిన నౌషద్‌ఖాన్ కన్నీటి పర్యంతం అయ్యాడు. దేశవాళీల్లో రాణిస్తున్న కొడుకుకు చాన్స్ దక్కకపోవడంపై ఇన్నాళ్లు వేచిచూసిన నౌషద్ భావోద్వేగానికి గురయ్యాడు. సర్ఫరాజ్‌ను గట్టిగా కౌగిలించుకుని తన భావాన్ని వ్యక్తపరిచాడు. మరోవైపు సర్ఫరాజ్ తన భార్యను ఓదార్చడం అక్కడున్న వారిని ఒక రకంగా కదిలించింది. మొత్తంగా దేశానికి ఆడాలన్న తన తండ్రి కల ఇన్ని రోజులకు నెరవేరినందుకు గర్వంగా ఉందని సర్ఫరాజ్ సంతోషం వ్యక్తం చేశాడు.

## క్వార్టర్స్‌లో నాగల్

**బెంగళూరు ఓపెన్**



బెంగళూరు: బెంగళూరు ఓపెన్‌లో భారత యువ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నాగల్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ పోరులో నాగల్ 6–2, 7–5తో కోల్‌మన్ వాంగ్(హాంకాంగ్)పై అద్భుత విజయం సాధించాడు. గంటా 46నిమిషాల పాటు సాగిన పోరులో నాగల్ వరుస సెట్లలో ప్రత్యర్థిని మట్టికరిపించాడు. తొలి సెట్‌లో 2–0 ఆధిక్యం కనబరిచిన నాగల్‌కు మరుసటి గేమ్‌లో వాంగ్ నుంచి ప్రతిఘటన ఎదురైంది. అయితే ఎనిమిదో గేమ్‌లో బ్రేక్ సాధించిన ఈ యువ ప్లేయర్ తొలి సెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. రెండో సెట్‌లో వరుసగా నాలుగు గేమ్స్ దక్కించుకున్న నాగల్‌కు వాంగ్ పోటీనిచ్చే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది.



*భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తన భార్య అంజలితో కలిసి గురువారం చారిత్రక తాజ్‌మహల్‌ను సందర్శించారు. సచిన్‌ను చూసేందుకు అభిమానులు ఆసక్తి కనబర్చడంతో ఒకింత రద్దీ ఏర్పడింది.*

# శతక జోరు

**సెంచరీలతో రోహిత్, జడేజా విజృంభణ • సర్ఫరాజ్‌ఖాన్ సూపర్ ఇన్నింగ్స్**

**భారత్ తొలి ఇన్నింగ్స్ 326/5 • ఇంగ్లండ్‌తో మూడో టెస్టు**



జడేజా (110*)



రోహిత్‌శర్మ (131)

**ఇంగ్లండ్‌తో రాజ్‌కోట్ టెస్టులో భారత బ్యాటర్లు శతక జోరు కనబరిచారు. ఐదు టెస్టుల సిరీస్‌లో మూడో పోరు కీలకమైన నేపథ్యంలో తమ సత్తాఏంటో చూపెట్టారు. 33 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్న జట్టును కెప్టెన్ రోహిత్‌శర్మ, జడేజా సూపర్ సెంచరీలతో ఒడ్డున పడేశారు. ఇంగ్లండ్ బౌలింగ్ దాడిని కాచుకు కూర్చుంటూ భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. రోహిత్, జడేజా సమయోచిత ఇన్నింగ్స్‌తో కోలుకున్న టీమ్ఇండియా..అరంగేట్రం క్రికెటర్ సర్ఫరాజ్‌ఖాన్ దూకుడైన బ్యాటింగ్‌తో మూడొందల మార్క్ అందుకుంది. ఆడుతున్నది తొలి టెస్టు అయినా ఎలాంటి తొణుకు బెణుకు లేకుండా ఆడిన సర్ఫరాజ్ ఇన్నింగ్స్‌కు ఇరుసుగా నిలువగా, సొంత ఇలాఖాలో జడేజా మరోమారు సెంచరీతో బ్యాట్‌ను తల్వార్‌లా తిప్పుతూ విన్యాసాలు చేశాడు.**

రాజ్‌కోట్: ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో కీలకమైన మూడో పోరు రాజ్‌కోట్‌లో గురువారం మొదలైంది. తొలుత టాస్ గెలిచిన భారత కెప్టెన్ రోహిత్‌శర్మ మరో ఆలోచన లేకుండా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే కెప్టెన్ నమ్మకాన్ని బ్యాటర్లు నిలబెట్టలేకపోయారు. మార్క్ వుడ్ ధాటికి స్కోరు బోర్డుపై 30 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయింది. ఈ తరుణంలో రోహిత్‌శర్మ(196 బంతుల్లో 131, 14ఫోర్లు, 3 సిక్స్‌లు), జడేజా(212 బంతుల్లో 110 నాటౌట్, 9ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 326 పరుగులు చేసింది. సర్ఫరాజ్ ఖాన్(62) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. సెంచరీ హీరో జడేజా, నైట్‌వాచ్‌మన్ కుల్దీప్ యాదవ్(1) క్రీజులో ఉన్నారు. మార్క్ వుడ్(3/69) మూడు వికెట్లతో ఆకట్టుకోగా, టామ్ హార్ట్‌లీ(1/81) వికెట్ పడగొట్టాడు.

**రోహిత్, జడేజా విజృంభణ:**

టాస్ గెలిచిన భారత్‌కు శుభారంభం దక్కలేదు. పిచ్‌పై తేమను సద్వినియోగం చేసుకుంటూ ఇంగ్లండ్ పేసర్ మార్క్ వుడ్..టీమ్ఇండియా టాపార్డర్‌ను దెబ్బతీశారు. వుడ్ ధాటికి ఓపెనర్ జైస్వాల్(10), శుభ్‌మన్ గిల్(0) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. వుడ్ వేసిన ఆఫ్‌సైడ్ హాఫ్‌స్టంప్ బంతిని ఆడబోయిన జైస్వాల్..స్లిప్‌లో రూట్ చేతికి చిక్కాడు. ఆ తర్వాత గిల్ పరుగుల ఖాతా తెరువకుండానే కీపర్ ఫోక్స్‌కు క్యాచ్ ఇచ్చి రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. తర్వాత క్రీజులోకొచ్చిన రజత్ పాటిదార్(5) మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. టామ్ హార్ట్‌లీ బంతిని సరిగా ఆడలేకపోయిన పాటిదార్..కవర్స్‌లో డకెట్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో 33 పరుగులకే భారత్ మూడు వికెట్లు కోల్పోయింది. ఈ తరుణంలో రోహిత్‌శర్మ, జడేజాతో కలిసి ఇన్నింగ్స్‌ను పునర్‌నిర్మించాడు. ఓ వైపు ఇంగ్లండ్ బౌలర్లు పరీక్ష పెడుతున్నా..తన అనుభవాన్ని ఉపయోగిస్తూ రోహిత్ అడపాదడపా బౌండరీలతో స్కోరుబోర్డును ముందుకు నడిపించాడు. మరో వికెట్ పడితే ఇన్నింగ్స్ కుప్పకూలుతుందనుకున్న తరుణంలో వీరిద్దరు సమయోచిత ఆటతీరుతో ఆకట్టుకున్నారు. చాలా రోజుల తర్వాత రోహిత్ పూర్వపు ఫామ్‌లోకి వచ్చాడు. ఓవైపు చెత్త బంతులను తనదైన శైలిలో శిక్షించిన హిట్‌మ్యాన్..జడేజాకు చక్కని తోడ్పాటు అందించాడు. లంచ్ విరామం తర్వాత తన కెరీర్‌లో 11వ సెంచరీ ఖాతాలో వేసుకున్నాడు. తానేం తక్కువ కాదన్నట్లు జడేజా కూడా బ్యాటు ఝుళిపించడంతో స్కోరుబోర్డుకు కీలక పరుగులు జతకలిశాయి. ఇన్నింగ్స్ సాఫీగా సాగుతున్న సమయంలో వుడ్ బౌలింగ్‌లో స్టోక్స్‌కు క్యాచ్ ఇచ్చి రోహిత్ ఔటయ్యాడు. దీంతో నాలుగో వికెట్‌కు 204 పరుగుల భారీ భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఇంగ్లండ్‌పై ఇది మూడో అత్యుత్తమ పార్ట్‌నర్‌షిప్‌గా నమోదైంది. రోహిత్ తర్వాత వచ్చిన సర్ఫరాజ్‌ఖాన్ అద్భుతమైన పరిణతి కనబరిచాడు. తొలి టెస్టు అయినా దూకుడు కనబరుస్తూ స్వీప్, లాఫ్టెడ్ షాట్లతో పరుగులు కొల్లగొట్టాడు. ఈ క్రమంలో 48 బంతుల్లో అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. అయితే జడేజా సమన్వయలోపంతో సర్ఫారాజ్ రనౌట్‌గా వెనుదిరిగాడు. కుల్దీప్‌యాదవ్‌తో కలిసి సెంచరీ మార్క్ అందుకున్న జడేజా బ్యాట్‌ను తల్వార్‌లా తిప్పుతూ తనదైన శైలిలో అభివాదం చేశాడు.







**సంక్షిప్త స్కోర్లు**

భారత్ తొలి ఇన్నింగ్స్: 326/5(రోహిత్ 131, జడేజా 110 నాటౌట్, వుడ్ 3/69, హార్ట్‌లీ 1/81)

**79** టెస్టుల్లో భారత్ తరఫున రోహిత్‌శర్మ కొట్టిన సిక్స్‌లు. సెహ్వాగ్(90) టాప్‌లో ఉండగా, ధోనీ(78), సచిన్(69)ను రోహిత్ అధిగమించాడు.

**3** భారత్ తరఫున టెస్టుల్లో మూడు వేలకు పైగా పరుగులు, రెండు వందల వికెట్లు తీసిన మూడో క్రికెటర్‌గా జడేజా (3003 పరుగులు, 280 వికెట్లు) నిలిచాడు. అశ్విన్ (3271 పరుగులు, 499 వికెట్లు), కపిల్‌దేవ్ (5248 పరుగులు, 434 వికెట్లు)



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.